# రాత్రిత్రయం

శ్రీమతి యు. సత్యబాల సుశీలా దేవి గారు

అతడామెను పలకరించబోతున్నాడు. ఆతొలి రేయి గాంభీర్యంలో అతని యౌవనహృదయ ముద్విగ్నమైపోయింది.

ఆమెముఖ మగోచరము. దాన్ని విపరీతపుసిగ్గుదొంతరలు అవనతక్రియలో దాచేశాయి. నీరసమైన కెంబెదవులు చలించిపోయినవి. ఆమె కరపల్లవ మాతనిచేతుల్లో మృదువుగా నలిగిపోతున్నది. అతడామెను పిలిచిన ఆమొదటిపిలుపు భయద ఘీంకారావృతమైనగాలితెరలో ఎచటికోలేచిపోయింది.

ఆమత్తేభం, మదోన్మతలో కట్లువిడిపించుకుంది. సేవకజనం గుండెల్లో రాయిపడి వ్యక్తు లదృశ్యమయిపోయినవి. అతడు క్షత్రియకుమారుడు. కర్తవ్యతాజంఝానిలంలో అతనిప్రేమహృదయం తేలిపోయింది.

మదగజం వశవర్తినియయి బంధించబడింది. అతడు తెలివిలేనిచూపుతో ఆశయనగృహద్వారం సమీపించేడు. కుక్కుటారవం హృదయనిర్భేదకమయింది. వెనుదిరిగేడు.

ఆమెకపోలం కరకమలావలంబిత. చూపులో వియోగభారం. హృదయంలో తెలియరాని ఉద్రేకం. జారిపోతూన్న కేశభారంలోంచి రాలిపోతున్న పువ్వులు. దూరంగాపళ్లెంలో అరవిరిసిన విరజాజులదండ నిశ్శబ్దంగా పరిమళిస్తోంది.

ఆదండ నెవరో మెల్లగాతీసి ఆమెజడలో ముడుస్తున్నారు! పరధ్యానం పటాపంచలయింది. జాలిచూపులురక్తిమ వహించేయి. ఆమె తిరిగిచూసింది. అతడు నవ్వుతున్నాడు. మోమాట మామెను ముంచేసింది. అతనిమనస్సు చిన్నవోయింది. అతడామెను రెండోమారు పిలిచేడు "మనోరమా!"

ఏమాధ్వని!! బ్రహ్మాండభాండం బ్రద్దలవుతోంది! రణభేరియా? శత్రువులు!శత్రువులు! దిక్కులు ప్రతిధ్వనించిపోయినవి. అతడు స్తంభించిపోయేడు. మనోరమారాధనకు పువ్వు తేరుకుంటూన్న ఆప్రేమహృదయంలో అన్యాయహృతరాజ్యరమాక్రందనం మారుబలికింది. వేదనాపూర్వకమైన దీర్ఘనిశ్వాసమామెయొద్ద సెలవుపొందింది.

మూడవ రేయి! నిశ్చలనదీప్రవాహంలో అవ్యక్తవేదనా స్వరం. భయసంభ్రమాలతో చెట్లకొమ్మల్లోంచి సంశయంగా తొంగిచూస్తోన్న సన్ననిచందమామ! యామినీపతి నీలిపట్టు చీరలో ఒత్తుగాచెక్కిన రత్నాల్లామెరిసిపోయ్యే తారకలు.

ధ్గారంగా మండుతూన్న చితి. దిక్కులు పిక్కటిల్లేటట్టు మంత్రవిలాపఘోషలు. ఆమె రక్తమాల్యాంబరధారిణి!

ముఖంలో పాదుకుపోయిన దుఃఖం, ప్రవేశిస్తూన్న గాంభీర్యం, హృదయంలో మోయలేనిబరువు. పాలిపోయిన పెదవుల్ని వణకిస్తూన్న ఆహారవాల్లో మనోహరనామం మలగిపోతున్నది.

విధీ! ఆమృదులతమపాదాలు స్వర్గసోపానాలనువలె చితినారోహిస్తూన్నవి. చితిమీద వీరస్వర్గమునందిన మనోరమామనోహరుడగు మనోహరుని శరీరము! ఆనేత్రాల్లోని సౌందర్యజ్యోతిని తారకలు దాచుచున్నవి. ముఖంలో చిరునవ్వు వెన్నెల వెన్నెల్లో కరిగిపోయింది. మనసులోనే మాయమైన ప్రేమమూర్తి స్వర్గద్వారంలో మనోరమారాధన కెదురుచూస్తోంది. "సతీ! ధన్యవు! త్వరితముగ మనోహరదర్శన మొందుము! సతికి పతితోడిదె లోకమునుమీ!"

ఆమె ప్రజ్వలితశరీరకాంతికి ప్రజ్వలితాగ్నికుమారుడు మెరుగులుదిద్దేడు. అతని ఉత్తమాంగ మామె యంకస్థితమైనది. నిన్నమొన్న పలుకరించిన పలుకనేరనిముగుద నేడు భర్తతోడి స్వర్లోకప్రయాణ మొనర్చుసతి!

సతీ!ధన్యవు. ప్రేమమయీ! ప్రణామములు. దేవీస్వరూపిణీ! నమస్కృతులు - ఆనీచూపుల్లో తొంకుతూన్న ధైర్యకాంతి నీవంశవీరుల కభయమొసంగునుగాక! నీ పవిత్ర ప్రేమాంకితనామాక్షరము సతీమతల్లులకు పావనమంత్రమయ్యెడిని- దేవీ! సర్వకాలమునకు భర్తృసహితవై స్వర్లోకమునందలి ప్రేమరాజ్యమున కధీశ్వరివై ప్రకాశింపుము! జననీ! నీజన్మభూమిని నీయట్టిపుత్రికలుకలిగి యుండునట్లుగ నాశీర్వదింతువుగాక!